# నిరక్షర కవిత

ముప్పయి ఎనిమిదేళ్ల సర్వీసు ఘనంగా చేసి మూడు నెలల క్రిందటే రిటరయినాను. పదవీ విరమణ నాకెంతో ఆనందాన్నిచ్చింది. పిల్లలందరూ సెటిలయ్యారు. పెన్షన్ డబ్బులు ఇంటా విడకిచ్చేస్తే ఆవిడ పెట్టింది తినొచ్చు. ఆపైన కాలక్షేపంగా మార్నింగువాక్‌లూ, సాయంత్రం సుబ్రహ్మణ్య మైదానంలో పనికిరాని పాలిటిక్స్, ఏడిపించే సీరియల్స్ ఉండనే ఉన్నాయి కాలక్షేపానికి. ప్రొద్దుట భోజనంలోకి ఓ వేపడం, ఊరగాయ, పెరుగూ, సాయంత్రం టిఫెనూ... రోజులు ఆనందంగా, దివ్యంగా జరిగిపోతున్న రోజుల్లో ఒకనాడు ప్రొద్దుటే మా ఇంటి తలుపు దడదడ మ్రోగింది. పాలవాడో, పేపరువాడో అనుకున్నానుగానీ నా బ్రతుకును బుగ్గిచేసే యములాడనుకోలేదు. ఆయనే ఈ కథకు నాంది.

"ఇక్కడికి మూడవ ఇంట్లో ఉంటాను. నా పేరు పద్మనాభం. మీరు రావ్‌జీయేనా."

"అవును రండి" నేను అయోమయంగా కుర్చీ ఆఫరు చేశాను. సర్వీసంతా బయట గడిపి, రిటైర్మెంటు వేళకి స్వంత ఊరు, ఇల్లూ చేరిన నాకు, ప్రక్క ఇంట్లో ఎవరుంటున్నారో తెలియదు.

నెరసిన తల, నల్లటి రూపు, కొద్దిగా మాసిన తెల్లని గడ్డం. సూటి చూపు, మాట కరుకు... లుంగీపంచెమీద చారలచొక్కాతో కొద్దిగా లావుగా, బొజ్జతో నిండుగా ఉన్నాడాయిన. కంచుకంఠ స్వరం, మాటలో కమేండ్. ఆయన ఆగమనానికి కారణం నాకు తెలియలేదు.

ఈలోగా ఎవరా అని మా ఆవిడ లోపల్నుంచి తొంగి చూసింది.

"నేనమ్మా పద్మనాభాన్ని. నిన్న మా ఇంటికి వచ్చి వెళ్లారట మీరు. తులసి చెప్పింది. తులసి మా ఆవిడ. మీరు, మేమూ చుట్టాలమే."

"రాజోలు పెద్దావధాన్లు రెండో కొడుక్కి మీ తోడల్లుడి చెల్లెలు ఆడబడుచునిచ్చాం. రాజోలు పెద్దావధాన్లు మీ పెద్దన్నయ్య వేలు విడిచిన బావమరిదికి స్వయానా తోబుట్టువు పెనిమిటే కదమ్మా" పద్మనాభం వివరించాడు.

ఈ వరసంతా ఏమిటో నాకర్థంకాలేదు.

"ఇతనేమిటమ్మా! నీ పెనిమిటి ప్రతి విషయానికీ అంత ఆలోచిస్తున్నాడు. ఇంటికి మహాలక్ష్మిలా నువ్వుండి ఈ సంసారం నడిపినట్టుందిగాని... ఇతడి నిర్వాకం ఏమీ కనబడదే."

"ఆయనకేంలెండి అన్నయ్యగారూ... అలా జరిగిపోతోంది" మా ఆవిడ నిట్టూర్పు.

"ఫరవాలేదులేమ్మా. కాఫీలేం పెట్టకమ్మా. వస్తాను. ప్రొద్దుట లేస్తే మీ ఇంట్లోగాని మా ఇంట్లోగాని మసలాల్సిన వాళ్లం. ఇలాంటి ఆచారాలూ, మొహమాటలూ పెట్టుకోకూడదు"

## నందుల వెంకటేశ్వరరావు

ఆయన లేచాడు.

"భలేవారే, అలా అంతమాట అంటే ఎలాగ అన్నయ్యగారూ. మీరు కాఫీ త్రాగకపోతే నా మీద ఒట్టే!"

పద్మనాభం ఇంటి పరిస్థితి గమనించాడు. ఇంట్లో ఆవిడదే పెత్తనం అని గ్రహించాడు. అందుకే ఆవిడ్ని మహాలక్ష్మి, వరలక్ష్మి అని ఉబ్బేస్తున్నాడు.

"నేను తాగనమ్మా, తాగనంతే. మన బంధుత్వం ఇంత వివరంగా చెప్పినా నువ్వేమిటమ్మా గారూ, గీరూ అంటూ. మనస్ఫూర్తిగా అన్నయ్యా అని పిలు. నా తోబుట్టువులా. మీ ఇంట్లో కాఫీయే కాదు, భోజనం, టిఫెనూ నా స్వంత హక్కులా చేస్తాను."

"అలాగే అన్నయ్యా".

మా ఆవిడ కళ్లలో ఆనందభాష్పాలు. నేను



అయోమయంగా బుర్ర గోక్కున్నాను ఈ అన్నా చెల్లెళ్ల అనురాగానికి. మా ఆవిడ ఇడ్లీ తెచ్చింది, నిండా నెయ్యి ఒంపింది. పద్మనాధంగారు లఘువుగా పద్నాలుగు ఇడ్లీ తిన్నాడు.

"ఆనక మీ అమ్మాయి దమయింతిని పంపు అన్నయ్యా. కోట ఆవకాయ వేసాను. నీ కిష్టంట కదా. తులసి చెప్పింది."

"చెప్పిందామ్మా... వెర్రిది. దానికీ నీలాగే ఆపేక్ష జాస్తీ చెల్లెమ్మా".

అక్కడేం జరుగుతోందో గాని నాకు మాత్రం మతిపోయి చాలాసేపే అయింది.


* * *

"రిటైరయిన తర్వాత ఇతగాడేం చేస్తున్నాడు చెల్లమ్మా" పద్మనాభం నావైపు నిశితంగా చూస్తూ అడిగాడు.

"ఏం చేస్తారన్నయ్యా. చేసినంత కాలం చేశారు. పిల్లలంతా సెటిలయ్యారు. పెన్షను పదివేలు వస్తుంది. ఆ పెన్షను నా చేతిలో పడేసి పుస్తకాలు చదువుకుంటూ, టి.వి చూస్తూ కాలక్షేపం చేస్తారు..." మా ఆవిడ చెప్పేది పూర్తికాలేదు.

"అదే నాకు నచ్చనిది"... మండిపడ్డాడు పద్మనాభంగారు.

"అరవైఏళ్ల వయసు పెద్దవయసుటమ్మా. మా తోడల్లుడి బావమరిది కొడుకు అమెరికాలో ఉన్నాడు. అక్కడ రిటైర్మెంటు అంటూ ఉండదట. ఎనభైయేళ్ల దాకా పనిచేస్తారట. గంటకిన్ని



ఫిబ్రవరి 26న హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయం ఎన్.టి.ఆర్. ఆడిటోరియమ్‌లో స్వీయరచన 'నాతిచరామి' నాటక సంకలనానికి కొలకలూరి విశ్రాంతమ్మ అభినందన పురస్కారాన్ని అందుకొంటున్న శ్రీమతి ఝాన్సీ కె.వి. కుమారి. ఫొటోలో వరుసగా డా॥ కొలకలూరి ఆశాజ్యోతి, ఆచార్య టి. గౌరీశంకర్. డా॥ కొలకలూరి ఇనాక్, డా॥ కందిమళ్ల సాంబశివరావు (కూర్చున్నవారు), డా॥ మధుజ్యోతి తదితరులు.

డాలర్లని లెక్కగట్టి కార్లో బస్సులో తోల్తారు. కాఫీ హౌసుల్లో పనిచేస్తారు. ఏ పని చెయ్యడానికైనా భేషజాలుండవు. పదివేలు... పదివేలంటున్నావు. ఈ రోజున పదివేలు. రేపు ధరలు పెరిగితే దానివిలువ వెయ్యికన్నా దాటదు. అలాగని ఇతగాడి పెన్షను పెరుగుతుందా? అంతేకాదు కన్నునొస్తుంది. కాలునొస్తుంది. ఆ ఖర్చులన్నీ ఎలా తెస్తాడు? పూర్వం అయితే అరవైఏళ్లు ముసలితనం క్రిందలెక్క. ఇప్పుడు సగటు జీవన ప్రమాణం పెరిగి ప్రతివారూ ఎనభైయేళ్ల దాకా బ్రతుకుతున్నారు."

నాకు మండిపోయింది. "పిల్లల్లేరా చూడటానికి..." కోపంగా అన్నాను.

"చూసావమ్మా ఇతగాడి వెటకారం. హక్కులు పంచుకుంటారుగానీ పిల్లలు బాధ్యతలు పంచుకుంటారటమ్మా. వాళ్లవాళ్ల సంసారాలు తప్ప ఇప్పుడు ఏ పిల్లలు తల్లిదండ్రుల్ని చూస్తున్నారు?"

"మరి ఎలా సంపాదించాలని తమరి సెలవు? ఈ వయసులో పద్దులు చూసే ఉద్యోగం ఇవ్వరు నాకు". నాకు చాలా చిరాగ్గా ఉంది. ఏ నేరమూ చెయ్యకుండా వివరణ ఇచ్చుకోవాల్సొస్తోంది. పద్మనాభం మాటల్లో ఫోర్స్‌కి.

"ముందర నీలో ఉన్న ఆ నెగెటివ్ దృక్పథాన్ని వదులుకోవాలి. నేను చూడు... నీలా ఉద్యోగం చెయ్యలేదు. ఓ టైపు మిషను పెట్టుకున్నాను. జాబ్‌వర్కులు చేసి నలుగురు పిల్లల్ని పైకి తెచ్చాను. అయినా టైప్‌మిషన్ను వదలలేదు. ఖర్చులు పెరిగితే నా ఛార్జీలు పెంచుతాను. నా పని నేనెప్పుడూ చిన్నతనంగా భావించలేదు. దొంగతనం చేస్తే తప్పు. మోసం చేస్తే తప్పు. నిజాయితీగా ఏం చేసినా తప్పు లేదు. సంపాదించడానికి బోలెడు మార్గాలున్నాయి. అప్సరా టాకీస్ దగ్గర వెదురుబుట్ట లల్లుతారు. రెండు కేజీల వేరుసెనక్కాయలు వేయించి గోదావరి గట్టుమీద నాలుగు ట్రిప్పులు తిరిగితే ఓ గంటలో ఏభై రూపాయిలు జేబులో వేసుకోవచ్చు. ఓ రిక్షాలో గ్యాస్‌స్టౌవ్, మూకుడూ నూనె పెట్టుకొని నాలుగు కేజీల సెనగపిండి చేత్తో పట్టుకున్నావంటే ఏ సెంటరులోనైనా రెండు గంటలపాటు మిరపకాయ బజ్జీలూ, పకోడీలూ వేస్తే ఖర్చులు పోను రెండు వందలు జేబులో వేసుకోవచ్చు."

"ఏమీ రాదనుకో... ఓ చెంబు తీసుకొని పుష్కరాల రేవు దగ్గర కూర్చుంటే గోదావరిలో స్నానానికి వచ్చేవాళ్ల నెత్తిమీద ఓ చెంబుడు నీళ్లు పోసి సంభావన వసూలు చేస్తే ప్రొద్దుట రెండు గంటలూ సాయంత్రం ఓ గంట పార్టు టైము జాబుకి రోజుకి మూడువందలు జేబులో వేసుకోవచ్చు. కానీ మనకు భేషజం. ఇలాంటి వ్యాపార కిటుకుల్ని అమెరికాలో చెప్పాననుకో. దీన్నే ఓ కన్సల్టెన్సీ క్రింద నేను నెలకి లక్షడాలర్లు సంపాదిద్దును."

నేనేం మాట్లాడలేదు. నా రిటైర్మెంటు ఆనందం ఆవిరిచేయడానికి ఈ పద్మనాభం ఎక్కడ దాపురించాడని ఆలోచిస్తూండిపోయాను.

* * *

"అమెరికాలో మీరు చెప్పినవి నిజమవుతాయేమోగాని ఇండియాలో సాధ్యంకాదు అన్నయ్యా" మా ఆవిడ నా జీవితానికి జీవం పోసింది. "కాస్త ఏదైనా మర్యాద ఉన్న ఉద్యోగం చూద్దురూ".

"స్వశక్తితో సంపాదించాలంటే ఇతడిలో ఏవో కొన్ని ప్రత్యేకతలు ఉండాలమ్మా. నీకు ఏం ప్రత్యకతలున్నాయో చెప్పవయ్యా". పద్మనాభం నా విషయంలో ఎప్పుడో ఏకవచన

ప్రయోగానికి వచ్చేసాడు.

"ఆయన చిన్నప్పుడు కవిత్వం వ్రాసేవారు అన్నయ్యా" మా ఆవిడ చెప్పింది.

"అది చాలమ్మా. ఇతన్ని గొప్ప రచయితని చేసేస్తాను." పద్మనాభం భరోసా ఇచ్చాడు.

"రచయితగానా ఎందుకన్నయ్యా" మా ఆవిడ ఆశ్చర్యపోయింది.

"ఎందుకేమిటమ్మా... ఈ రచయితల సంపాదన ఎంతనుకుంటున్నావు. సినారె ఒక్క సినిమాలో పాటలకు ఎంత సంపాదిస్తాడను కుంటున్నావు? సిరివెన్నెల సీతారామశాస్త్రి ఒక్క సినిమాకు పాటలకు లక్షలు సంపాదిస్తాడు. పరుచూరి బ్రదర్స్ అని అన్నదమ్ములు సినిమా కథలల్లి ఈ రోజున కోటీశ్వరులయ్యారు. పోకిరీ అనే సినిమా చూసావా చెల్లెమ్మా... అందులో డైలాగులు ఆ దర్శకుడే వ్రాసాట్ట. దానికీ రూపాయలు పుచ్చుకున్నాడని వినికిడి."

మా ఆవిడ కళ్లు రంగులరాట్నం ఎక్కినంతగా తిరగసాగాయి. "మీరీపూట ఇక్కడే భోజనం చెయ్యాలి అన్నయ్యా" మా ఆవిడ కళ్లలో దాగని ఆనందం.

"అలాగేకాని చెల్లెమ్మా నేను పట్టుబట్ట కట్టనిదే భోజనం చెయ్యను" ఆయన ప్రక్కింటి కుర్రాడ్ని ఇంటికి పంపాడు పట్టుబట్ట తేవడానికి.

భోజనం చేస్తూ చాలా విషయాలు చెప్పాడు పద్మనాభం. "ముందు నాలుగు కవితలు, రెండు కథలూ పత్రికలో పడాలమ్మా. ఆ విషయం నాకు వదిలిపెట్టు. ఆ తర్వాత హైదరాబాదు వెళ్లి సినిమాల్లో ప్రయత్నం చేద్దాం. లేకపోతే టి.వి. అయినా ఉండనే ఉంది. అయినా చెల్లెమ్మా మీ ఆయన పేరు పుస్తకంలో కవిగాకాని రచయితగాగాని చూడకుండా నేను ఈ ఇల్లు వదిలివెళ్లను. ఇది నా వాగ్దానం." ఆయన గంభీరంగా చెప్పాడు. నా గుండెల్లో రాయిపడింది.

భోజనాలయ్యాయి. మా ఆవిడ దూట ఆవకాయితో బాటు సెనగల పాలోలీ కూడా చేసింది. నాకు నిద్ర బద్దకంగా ఉంది.

"ఇప్పుడు తేవయ్యా నీ కవిత్వం." పద్మనాభం గారు పర్మిషనిచ్చారు". నేను మొహమాట పడ్డాను.

"ఫరవాలేదు చదవవయ్యా" ఆయన భరోసాతో నెమ్మదిగా చదివాను.

"కాకి ఒకటి చిన్నది... కావు కావు మన్నది."

"బాగుంది. తర్వాత"


"పిచ్చిక ఒకటి బుల్లిది కిచ కిచ మన్నది"

"ఇంకా నీలో ఆ మెరుపు, అదే స్పార్క్ ఉంది. పోకిరీలో జనంలో నలిగిన ఒక డైలాగు ఉంది". ఎవడు కొడితే జనం దిమ్మతిరిగి పడతారో ఆడే పండుగాడు." ఇలాంటి డైలాగొకటి చెప్పవయ్యా."

నేను అయోమయంగా చూసాను.

ఆయినకేంగాని నేను చెబుతానన్నయ్యా. "కాల్చి వాతెడితే ఎవరు కెవ్వుమంటారో ఆయనే

జీవితంలో సంతోషం అనేది
నీ ఆలోచనలను అనుసరించి
ఉంటుంది.
అయితే నీ ఆలోచనలు
నీ స్నేహితులు, నీ చుట్టూ ఉండే
మనుషులను అనుసరించి ఉంటాయి




నా మొగుడు వెర్రివెంకన్న." ఆవిడ ఘనంగా చెప్పింది.

"బాగుందమ్మా నువ్వే రచయిత్రివి అయ్యే టట్లున్నావు." పద్మనాభంగారు ఆవలించారు. మరో పది నిముషాల్లో గుర్రు ప్రారంభించారు.

**చుట్టు**ప్రక్కలవాళ్లు నన్ను చూసి జాలిపడడం మొదలుపెట్టారు. పద్మనాభం బ్రతుకుతెరువు అదేనట. ఎవరు కొత్తగా వచ్చినా ఏదోవిధంగా ఆ ఇంటచేరి ఏడాదో రెండేళ్లో గడిపేస్తాడట.

పద్మనాభానికి కావల్సిన నేతిమిఠాయిలూ, మినపసున్నీ, కజ్జికాయిలు, పనసపొట్టు కూర, మామిడికాయపప్పు, కొత్తావకాయతో షడ్రసోపే తమైన విందులు చెయ్యలేక మా ఆవిడ సతమతమైపోతోంది.

నా రచన ఏదో ఒకటి ప్రచురించబడితే గానీ పద్మనాధం నా ఇల్లు వదలడు. నాకు రాయడం రాదు. చివరికి నాకు తెలిసిన ఓ ఎడిటరు ఫ్రెండ్‌కి ఉత్తరం వ్రాశాను. నాలాంటి నిరక్షరకుక్షి రచన ఏదైనా ఒకటి ఎంత ఖర్చ యినా ఫరవాలేదు. ఏదో ఒకటి ప్రచురింప జేయమని.

"నీ ఉత్తరంతోనే నువ్వో రచన చేశావు." మా ఎడిటర్ ఫ్రెండు వ్రాసాడు.

తరువాత మూడు సంచికలలో అపూర్వ ప్రకటన. నిరక్షరాస్యుల ఆశాకిరణం కవి "రావ్ జీ" కవిత, అపూర్వకవిత, అతి త్వరలో... ఇంత సస్పెన్సు తర్వాత నా కవిత ప్రచురింపబడింది.

"నిరక్షర కవిత" అన్న మకుటంతో. కవిత కోసం చూస్తే ఒక తెల్ల కాగితం మీద బోర్డరు మధ్యలో ఒక వేలిముద్ర... చక్కటి నిశానీ.

ఈ రచన అంకితం గురుదేవులు పద్మ నాభంగారికి అన్న నివేదనతో. మరి కష్టపడి పద్మనాభంగార్ని వదిలించుకున్నానని చెప్పన క్కరలేదనుకుంటాను. ●